స్కెచ్ :

# ఆత్మహత్యాభియోగం

శ్రీ. కె. ఆర్. కృష్ణ

'ఎందుచేత' అని మీరు నన్ను నిలదీసి అడిగితే చెప్పలేంకాని ఎందుకో హంగుకు మొత్తానికి మనకి జీవితంమీద విరక్తి కలిగిన మాట వాస్తవం. విరక్తికలిగినమాత్రం చేసేదేముందీ? చావడం తప్ప. చావడం అంటే మాత్రం సామాన్యమైన పనికాదుగనుకనా? వెనక ఎవరికైనా ఓ బిడ్డడు పుట్టాడూ అంటే ఎంతో సంతోషపడేవారు వాడితాలూకు బంధుమిత్రపరివారమంతాను. ఇప్పుడో? ఎవరైనా జారిపోయాడూ అంటే 'అహా! ఎంత అదృష్టవంతుండీ! సుఖంగా నిక్షేపంగా జీవితానికి మంగళం పాడేశాడు' అనివిస్తుపోయి, కనపడ్డవాడి కల్లా బొట్టూ కాటుకా పెట్టి, కవిత్వధోరణిలో మరీ చెప్పుకపోతున్నారు. ఈ చావడం అనే కార్యం ఎంతకష్టసాధ్యమైనప్పటికీ, చావదలచుకున్నవాళ్లం గనుక చావక చేసేదేముంది?

మా ఆవిడతో 'ప్రేమేవ్' సుందూ! (మాఆవిడ అసలుపేరు స్వప్నసుందరి. అయితే అది స్వప్నంలోమాత్రమే సుందరిలా కనబడుతుంది గనుక 'సుందూ' అని పిలుస్తుంటాం) ఈ జీవితం అంటే రాను రాను అసహ్యం వేస్తోంది. సాధ్యమైనంత త్వరలో జీవితానికో మంగళం పాడేయదలచుకున్నాం' అనేసరికి వెంటనే మా ఆవిడ 'అయ్యో అలా అంటారేమిటండీ? మీరు లేకపోతే నాగతేం కావాలి? అని మామీద పడి మమ్మల్ని కావిలించుకుని శోకాలాపనలతో ఏడ్వాలా (కనీసంనటనకైనాను)? అహా? అటువంటి పొరపాటేమీ చేయలేదు. పోగా 'మిమ్మల్ని చావొద్దని ఎవరు బ్రతిమాలారూ? వెంటనే చచ్చిపొండి నిక్షేపంగాను. చస్తానని బెదిరిస్తారేమిటీ, మహాబ్రతికి అందరినీ ఉద్ధరిస్తున్నట్టు?' అని అనేసింది ధపీల్మని నవ్వుతూ. నా మొహం అట్ల పెనం మాదిరిగా నల్లబడడం చూచి 'సతి నేహాస్యానికన్నానండీ, మీరు ఎల్లానూ చావరు; చావలేరు. ఒకవేళ చస్తే మాత్రం నే నూరుకుంటానా? వెంటనే సహగమనం చేసెయ్యనూ?' అంది సుందు.

మాకు మాత్రం సుందు మాట్లాడినమాటల్లో ముందు భాగం నమ్మకంలో వెనకభాగం నమ్మకంలో ఇప్పటికీ తికమకగానే ఉంది.

మనకిమాత్రం చావాలనే పట్టుదల రోజురోజుకీ చింకమాతోంది. ముఖ్యంగా మన చావునుగురించి మా సుందుకే నమ్మకం చాలనప్పుడూ, పైవాళ్ళు ఖర్మమేం కాలిదంట మనమాట నమ్మడానికి? మా సుందుకిమాత్రం మనలో ఎక్కడో చోట చావగల సామర్థ్యం నక్కి ఉందనే సంగతి తెలియజేయాలి. ఆత్మహత్యకి సులభమైన మార్గాలు లక్షోప లక్షలున్నాయి. నేపాళపుకాయల చిదగగొట్టి నూరుకుతాగామంటేసరి తక్షుమని చచ్చి ఊరుకుంటాము. అయితే ఆ నేపాళపుకాయలతోపాటు మన తలకాయనికూడా జత చేసి రోట్లో మా సుందు వేస్తుందనే భైర్యంకొద్దీ సదరు ప్రయత్నం ఉపసంహరించుకోవాల్సొచ్చింది.

విలువైన వాటిల్లో అతివిలువైనదీ మహావిలువైనదీ అయిన ఉపాయం ఒకటి తట్టింది. సదరు ఉపాయాని కనుగుణంగా ఒక తులం నల్లమందుపర్మిటుకోసం ఒక దరఖాస్తునో దానిని స్వహస్తాలతో వ్రాసి దానిని నిస్వయంగానే తహసీల్దారుగారి కందజేశాము. ఆయన మన కేసీ మనదరఖాస్తుకేసీ ఎగాదిగా చూస్తోంటే మన గుండెదడదడ లాడింది. 'మన ఆత్మహత్య తాలూకుభోగట్టావీడి కెలా తెలిసిందిరా బాబూ! కొంపదీసి అరెస్టు చేయించడుగదా!' అనిఅనుకుంటుండగనే ఆయన 'ఫో యూ'. జాంపండలాంటి కుర్రాడివి, నీకు నల్లమందు అలవాటేమిటోయ్' అని చెప్పి నవ్వుతూ నవ్వుతూ నాలుగుచివాట్లు వేసేసరికి మన ముహం కందగడ్డలా తయారైందని వేరే చెప్ప నవసరం లేదనుకుంటాం. దరఖాస్తును తహసీల్దారుగారిదగ్గరనే విడిచిపెట్టి మెల్లగా బయటికి జారుకున్నామనుకోండి!

ఇంతకీ మనచావు విషయం పురుట్లోనే సంధికొట్టినట్టైంది. ఇంటికొచ్చేసరికి మా సుందునవ్వు మొహం చూసేసరికి నరికిపారేయబుద్ధయింది. మరి మన మొహం చూస్తే దానికెలా అనిపించిందో!, 'ఏమిటండీ? అస్తమానం అలా చిరచిరలాడతారూ?' అంది విసుగ్గాను. కాళ్లు కడుక్కోవడానికని పెరట్లోకి వెళ్లేసరికి నీళ్ళబావి మనతాలూకు కర్తవ్యాన్ని జ్ఞప్తికి తెచ్చింది. మరుక్షణంలో మన శరీరం నూతిలో కనబడింది. చచ్చిపోయాననుకునేరు. అంత అదృష్టం ఇంకా మనపాలిట ప్రత్యక్షం కాలేదు. మోచేతులూ, మోకాళ్లూ మాత్రం విరిగిపోయాయంతే. నూతిలోకి ఉరకబోయేముందు ఆ నూతిలో కనీసం రెండు బిందెల నీళ్ళయినా ఉన్నదీ లేనిదీ ఆలోచించైనా ఆపని చేయాల్సింది. ఆ బావితాలూకు నీళ్లు కనబడడం మానేసి చాలాకాలమైంది అనేసంగతికూడా మరిచిపోయాం ఆసమయానికి. ఇంతకిచావంటేఅంత ఆదుర్దాగా ఉంది మనకి. సుందు చరచరా నూతిగట్టుదగ్గరికి వచ్చి 'ఎవర్ని జడిపిస్తారు లెద్దురు? ఇంతకీ నీళ్లులేనిబావిలో పడితే చస్తారని ఎవరు చెప్పారంట మీతో?' అంది నవ్వుతో వెక్కట్టుకుపోతూ. పిల్లికి చెలగాటం ఎలుక్కి ప్రాణపోకడలా ఉంది మనపని. 'ఎవరైనా చూస్తే నవ్వగలరు. వెంటనే పెద్దనిచ్చెన నూతిలోకి దించవే, పైకి వచ్చేస్తానని' మనం, 'పైకి వచ్చిం తర్వాత ఓ కోయంబత్తూరుచీర కొనిస్తానని ఒట్టువేసేవరకూ నిచ్చెన వెయ్యనని' సుందూ. ఇంకాసేపుంటే ఇరుగుపొరుగు ఇళ్ల వాళ్లంతా పోగైపోతారురా నాయనా అనుకుని కోయంబత్తూరు చీర కొనిస్తానని చెప్పి, బయటపడ్డాము.

చావడాని కెలానూ సంసిద్ధులమైయున్నాము గనుక చచ్చేముందుకూడ సుందుకెక్కడ లంచం పెట్టనూ? అంచేత ఆ చచ్చే దేదో వెంటనే చస్తే సుందుకి కోయంబత్తూరు చీర ఎగవేసెయ్యొచ్చనుకుని మరోమాంచి ఎత్తు వేశాము కాలేజీ లేబొరేటరిడిమాన్‌స్ట్రేటరు సుబ్బారావుగారి జేబులోకి ఓ అయిదు రూపాయలనోటు తోసేశామంటే సరి, మనకి

కావలసినంత సల్ఫ్యూరిక్ ఆసిడ్. మనకర్మకొద్దీ ఆవేళే ఆయన సెలవుపెట్టాడేఁ? అక్కడున్న డిమాన్‌స్ట్రేటర్లెవరూ అచ్చట లేనిసమయం చూసి ఓకాన్‌సెక్‌తో క్రేటెడ్ నైట్రిక్ ఆసిడ్ బాటిల్ ఒహటి జేబులోకి తోసేసి ఖంగారుగా బయటికి వస్తుంటే ప్రక్కజేబులోనున్న సీసా తలుపుకి తగిలి అది కాస్తా పగలడం, మనకాలంతా పంట్లాంతో సహా కాలడం ఒకేసారి జరిగాయి. యీరభస చూసి ప్రక్కగదిలోనున్న డిమాన్‌స్ట్రేటర్లంతా ఓమే డే పెరేడ్‌లా వచ్చి, మనకాలు కాలినందుకు సానుభూతిచూపకపోగా నన్ను నానాచీవాట్లూ వేసి, వాళ్ల లాబొరేటరీలోనున్న సోడియం హైడ్రాక్సైడంతా మన కాలుమీదనే స్ప్రేటుచేశారు.

కాలేజీకెమిస్ట్రీలేబొరేటరీలో ఆవిధంగా గోడు తిని, కాలినకాలు మెక్కుకుంటూ వస్తూండగా వెనకనుండి కారుశబ్దం వినబడింది. మృత్యుదేవత ఈసారి మననుండి పారిపోలేదు అనుకుని రోడ్డుకు మధ్యగా నడుస్తున్నాం. మనమీదనుండి బస్సుపోతుందనే ధైర్యంకొద్దీ రోడ్డుకు మధ్యగా నడుస్తూపోతోంటే ఆ బస్సువాడు మనని తప్పించుకుని ఏప్రక్కనుండో పోతాడనే అనుమానం తగిలి వెంటనే రోడ్డుమీదజిగ్‌జిగ్ పోజిషన్‌లో నడవడం ప్రారంభించాం. బస్ డ్రైవరు ఊరికే హారన్ తెగవాయించిపారేస్తున్నాడు. ఆ హారన్ మనకెందుకు దినబడుతుంది! డ్రైవరు బస్‌ని ఆపుజేసి మహాఘనకార్యం చేసినవాడల్లే మనదగ్గరకొచ్చి మన జబ్బనుకుదేసి 'చవిటి వెధవలాగ హారన్ వినిపించుకోవేమ్? నువ్వుచస్తావని దిగులులేదు మాకు. నీతో బాటు మమ్మల్నీ చంపుతారు ఈపోలీసువాళ్లు అని ఈ దవడా ఆ దవడా అడపా తడపా వాయించిపంపేశాడు మన్ని. నడిరోడ్డుమీద ఒహబస్సుడ్రైవరు మనని అలా అవమానపరిచాడూ అంటే మాసుందు కెంత చిన్నతనంగా ఉంటుందీ! ఈసంగతి మా సుందుచెవిని పడిందీఅంటే ఆ డ్రైవరుగాడి పెళ్లాంబిడ్డలనుండి వాడి వంశవృక్షాన్నంతనీ దుమ్మెత్తిపోస్తుందా? లేదా? ఈమాత్రమైనా ఆలోచించాడూ ఆ డ్రైవరుసన్నాసి? ఎందు కాలోచిస్తాడూ? వాడూ డ్రైవరువెధవ! వాడికి ముందుచూపే గాని వెనుకచూపెందు కుంటుంది!

ఇంటికి వచ్చిరావడంతోనే సుందు నాకాలినకాలునీ, రంగువేసుకున్న రెండు దవడల్నీ చూసి 'ఏమిటండీ ఇదంతా?' అంది. అడగ్గానే చెప్పేస్తే మన గొప్పతనమేముందీ! అంచేత కాస్సేపు దానిచేత బతిమాలించుకుని, కాసిన్ని మంచినీళ్లు తెప్పించుకుని తాగి, తాపీగా జరిగిన వృత్తాంతాన్నంతనీ సవిస్తరంగా తెలియజేశాం. 'ఏమిటీ! ఒహ అనామకుడు, ఓహ బస్సుడ్రైవరువెధవ కొట్టాడా మిమ్మల్ని' అని అంటోంది సుందు. ఇహ వరసని ఆ డ్రైవరుగాడి కొంపంతా కూలిపోతుందిరా బాబూ అనుకొని చెవులు మూసుకోబోయే కొమయంలో సందు'పట్టినే దవడమీద పట్టి ఊరుకున్నాడేమిటీ, వెధవ! ఏ కాలో దమక్కో విరగ్గొట్టెయ్యక, అప్పుడైనా శుభ్రంగా ఇంట్లో పడుందురు' అని వాణ్ణి తిట్టిపోస్తోంటే మనకి 'హంచిబాక్ ఆఫ్ నాటర్ డామ్' సినీమాలో చార్లెస్ లాటన్ను కొట్టిన ముళ్ళకొరడాలు మెరగనిపించాయి **ఆ తిటకంతో.**

ఇప్పటికి మనం చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడం చూస్తే మన తాలూకు ఆత్మహత్యాప్రయత్నం విరమించుకోవాల్సి వస్తుందనే భయం కలక్కపోలేదు. రోజూ వార్తాపత్రికల్లో నలుగుర్నీ అయిదుగుర్నీ కమ్యూనిస్టుల్ని పోలీసువాళ్లు కాలుస్తున్నారనే విషయాన్ని చదివాక కమ్యూనిస్టులతో సావాసం చేశాము, కాని మన నే పోలీసువాడూ కాల్చలేదు సరిగదా ఓలాటీపోటైనా రుచిచూపించలేదు. ఓరోజున విసుగెత్తి ఓపోలీసాడితో 'ఏవోయ్! నేను మంచి పేరున్న కమ్యూనిస్టుని. నన్నుమాత్రం కాల్చిచంపేరుసుమా!' అన్నాం. వాడు వెంటనే అదేంటి అబ్బాయిగారూ? నాతో పరాచకాలేంటి బాబయ్యా? మీరు కమ్యూనిస్టంటే ఏ చచ్చినాడు నమ్ముతాడు బాబయ్యా. వాళ్ళంతా అదోరకంమూక బాబయ్యా' అన్నాడు. చివరకి ఇరవైరూపాయల పోలీసువెధవకూడా మన మాటని నమ్మలేకపోయాడూ అంటే మన గొప్పతనం ఆలోచించుకోండి.

మన ఆత్మహత్యకుసంబంధించిన విషయం ఇంకా ప్రయత్నాల్లోనే ఉందన్నమాట. రాబర్టుబ్రోన్ అంతటివాడు 'ప్రయత్నించు, మళ్ళీ ప్రయత్నించు' అన్నాడు. మనంమాత్రం మన ప్రయత్నాలనుండి విరమించుకునే సూచన్లేమీ మనకే కనబడ్డంలా. సాధారణంగా మనుష్యులు ఆత్మహత్యచేసుకునే సాధనలన్నీ ఆచరణలో పెట్టాము, రివాల్వరు, రైలుక్రింద తలపెట్టడం తప్ప. రివాల్వరు సంపాదించడమంటే మాటలతో పనికాదు. నోరుచెడి ఎవరినైనా ఓసారి మీ రివాల్వరిస్తారా అని అడుగుతామనుకోండి వెంటనే వాడు గుక్క మలుపుకోకుండా అడిగే ఎదురుప్రశ్న ఏమిటీ? పిట్టపడేలా? సెప్రహారా ఆ? అని. ఆదెబ్బతో మన వళ్లు చల్లబడి ఊరుకుంటుంది. మనగోడు వాళ్ళకేం అర్థం అవుతుంది. అంచేత రివాల్వరు సంపాదనా ప్రయత్నం సమర్యాదగా విరమించుకుని వేరేప్రయత్నంచేయాల్సొచ్చినది.

సాయంత్రంవరకు సుందుతో సుఖంగా కాలం వెళ్ళబుచ్చి (ఆఖరుసారిగదా అనుకొని) తరువాత గ్రామపుపొలిమేరల్లోకి బయలుదేరాము. రైలుబద్దీలవారన ఓ అరగంటసేపు రైలు ఆగమనానికై నిరీక్షిస్తూ కూచున్నాం. సాయంత్రం అయిదున్నరకి రావాల్సినబండి మామూలు అరగంటలేటుతో కలుపుకొని ఆరు అరగంటల పదినిమిషాలకి ఫలానాస్టేషన్ వదలి ఈశాన్యదిక్కుగా మరో చూపుస్టేషనుకు పురోగమిస్తోంది. రైలుబండి కనుమేరలో ఉండగనే (ఆలస్యా దమృతం విషం అన్నారు కదండీ?) రెండుకమ్ములకీ మధ్యనున్న స్లీపర్లపై రైలు వస్తున్న దిక్కుకే మనమూ పయనించసాగాం. రైలు ఊరికే కూసేస్తోంది. మన కెందుకు వినబడుతుంది ఆ కూత! మనంమాత్రం కళ్లు మూసుకుని ఊరికే నడిచేస్తున్నాం, ఏక్షణాని కా క్షణం మరుక్షణంలో రైలు మనమీదనుండి దొర్లిపోతున్నట్టు భావిస్తూ. రైలు ఒక్కసారి ఆగిపోవడం, దానితాలూకు డ్రైవరూ, గార్డూ ఇత్యాదిసమూహమంతా మనచుట్టూ పోగై నానాచీవాట్లూ వేయడం ఏకకాలమందు జరిగాయి. ఆరాత్రినుంచే ప్రక్కఊరి పోలీసుస్టేషనులో మనకి బస ఏర్పాటు చేయబడింది. కోర్టువారు మనం ఫలానా సెంట్రల్ జైలులో ఓ సంవత్సరంపాటు బస చేయవలసినదిగా ఉత్తర్వు జారీచేశారు.

ప్రభుత్వంవారి ఇనుపకటకటాలలో విడిది అల్లుడిలాగా ఎనిమిదినెలలు గడిపాం. మరో నాలుగునెలల్లో మనం మన సుందూ తయారు. అయితే ఈ నాలుగునెలూ ఆ కటకటాలలో జీవించడం దుర్భరంగా తోచింది. మర్నాటి ఉదయం జైలుడాక్టరు వచ్చి 'ఏమండీ రావుగారూ! ఖులాసా? అని కుశలప్రశ్న వేశాడు. డాక్టరుని దగ్గరసారానిచ్చి పొగడీసి ఆయన తాలూకు దవడకు

మన తాలూకు చేతిలో గట్టిగా ముద్దుపెట్టించాం. ఆ మర్నాడుమాత్రం డాక్టరు కొంచెం దూరనించే పలకరించాడు. డాక్టరు ఒహటేమిటి! జైలరూ, పోలీసులూ మనని సమీపించినవాళ్ళందరూ వారివారి భాగాలు పంచుకుపోయారు మూడురోజుల్లో. నాలుగోరోజున జైలులో మనకి స్థానం లేదన్నారు. ఇంటికి పోనివ్వ లేదు సుమండీ! జైల్లోని గాలిలేని గదులు మన ఆరోగ్యానికి భంగకరంగా ఉన్నట్టు జైలుఅధికార్లూ-జైలుడాక్టరూ భావించడంచేత మనని విశాఖపట్నపుసముద్రపు గాలిని ఆస్వాదించమని కోరుతూ, విశాఖపట్నపు ల్యూనెటిక్ ఆసిలముకు బదిలీ చేశారు.

సెంట్రలుజైల్లో జీవితానికీ, ఇచ్చటి హాస్పిటలుజీవితానికీ గల వ్యత్యాస మేమిటంటే జైల్లో మనతోపాటు మన గదిలో ఎప్పుడూ ఇద్దరు ముగ్గురు భాగస్వాములుండేవారు. ఇచ్చట మన గదిలో మనదే ఏకచ్ఛత్రాధిపత్యం. డాక్టరుతో చెప్పాము. 'మన కేమీ పిచ్చి లేదనీ, జైలునుండి విడిపించుకోడానికి వేసిన ఎత్తు అనీను' నామాటలు పూర్తి కాకుండానే డాక్టరు 'నీవు మాట్లాడేదంతా పచ్చి అబద్ధం' అనేసరికి మన శరీరంనిండా తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. అంతలో ఊరుకున్నాడూ! 'అబ్బాయి! సాధారణంగా పిచ్చివాళ్ళంతా ఇలానే అంటుంటారు. వాళ్ళకేమీ పిచ్చి లేదని. అసలుమాటకొస్తే పిచ్చిలేనివాడెవడూ ఈ ప్రపంచంలోనే లేడు. నీకు పిచ్చి లేదని నీవు అన్నావూ అంటే అదేరోగం. ఈ పిచ్చిఅనే పదార్థం ప్రతివ్యక్తిలోనూ కొద్దిగానో గొప్పగానో, వివిధరూపాల్లో తాండవిస్తుంటుంది. ఈ పదార్థం ఏవిధంగా, ఏ రూపంలో, ఏద్వారంగుండా, మెదడులో ఏభాగంలో ప్రవేశించి దాని స్థావరం ఏర్పరచుకున్నదీ, అది ఎక్కడెక్కడి సీలల్ని ఊడబెరికినదీ మేము దయాగ్నైజ్ చేసి వదులైన సీలల్ని వాటివాటి స్వస్థానాలలో అతిసైంటిఫిక్‌గానూ, టెక్నికల్‌గానూ అమర్చి మరీ నిన్ను బయటికి పంపిస్తాం' అని ఓసుదీర్ఘమైన ఉపన్యాసం దంచిదంచి వదిలేసరికి, మన బుర్రలోని సీలలన్నీ నిజంగా లూజ్ అయినట్టు అయింది మనకి. వాడి ఉపన్యాస మేదో వాడిదే గాని అది మనకెంత వెగటుగా ఉందో

[illegible]

మల్లే ఉంది) చూసినట్టయితే వాడికి సుగ్రాహ్యమయ్యేది. ఈ హాస్పిటల్లోని సుగుణ మేమిటంటే ప్రతిరోజూ ఉదయమూ సాయంకాలమూ ఓమేల్‌నర్సు వచ్చి నిమ్మళపులుసుతో ఓ మంగలివాడు చేసేపని చేసిపోయేవాడు.

ఆస్పిటల్లో 15వనెల జరుగుతోంది. ఓరోజు ఉదయమే డాక్టరు వచ్చి చెప్పాడు. 'రావుగారూ! మీ మెదడు తాలూకు సీలలన్నీ వాటివాటి యథాస్థానాల్లో అతిశాస్త్రీయంగానూ, నవీన పద్ధతుల్లో దృఢంగా బిగించబడ్డవి. ఇప్పుడు మీ బుర్ర యాంత్రప్రపంచంలో ఏమూలనైనా ఘనంగా రాగస్తుంది. మీ రీహాస్పిటలునుండి వెళ్ళిపోవచ్చు.' అన్నాడు.

ఇంటికి రావడంతోనే సుంకుతో అన్నాము. 'ఏమేవ్, ఇంతకాలం నేను కనబళ్లేదుకదా, నేను చనిపోయాననుకుని ఎందుకు సహగమనం చేయలేదు,' అని. వెంటనే అది తడుముకోకుండా 'నే నిదివరకే చెప్పలేదూ! మీరు చావరనీ, చావలేరనీను! మీరు నిజంగా ఆత్మహత్య చేసుకున్నప్పుడు నేనూ మీఅడుగుజాడల్లోనే నడుస్తానులెండి.' అంది నే నెలానూ చావలే ననే ధీమాతో.

మళ్లీ మన కథ బయలుదేరినచోటుకే వచ్చింది. ఇంతా జరిగిన తర్వాత ఇప్పుడు ఆత్మహత్య చేసుకోవడమా? కి లేదా? మీరంతా కలిసి మన్ని చావమన్నా సరే, మనమిప్పుడు చచ్చినా చావము. రాబర్టుక్లైవు కూడా మనకిమల్లేనే చావాలని ప్రయత్నించి విఫలుడై, ఓరోజున ఉన్నట్టుండి పెద్దవాడై పోయాడు. అంచేత మనం కనీసం రిపబ్లిక్ అధ్యక్షపదవినైనా స్వీకరించగలమనే ధీమా మనకుంది. అందుచేత మీ అందరికీ నే హెచ్చరించేదేమంటే మనం అధ్యక్షపదవి వెలిగించేప్పుడు, ఈకథ చదివిన ప్రేక్షకులందరికీ ఉద్యోగసంపాదనలో ప్రిఫరెన్సు ఇవ్వబడుతుంది గనుక ఈ Extra Qualication ని సంపాదించుకోమని మీ బంధుమిత్రులందరికీ చెప్పుకోండి. మనతో అధ్యక్షపదవికిమాత్రం పోటీపడకండేం!

---


సర్వోత్కృష్టమైన
"కానన్ దేవన్"
టీ మాత్రమే త్రాగండి




చీఫ్ ఏజంటు: కర్నూలు, అనంతపురం, కడప & చిత్తూరు జిల్లాలకు
కె. ఎ. జోషి, అనంతపురం.
టోకు వ్యాపారస్తులకు విశేష సౌలభ్యము
వివరములకు నేడే వ్రాయండి.